క్లుప్తంగా

అన్నపూర్ణ పథకానికి విరాళం



విరాళం అందచేస్తున్న లక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి పది వేల రూపాయల విరాళం సమకూరింది. హయాతీనగరం భజన మండలి సభ్యులు అందవరపు లక్ష్మి తన భర్త సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా పథకం కార్యదర్శి కిల్లాన ఫాల్గుణరావుకు ఈ మొత్తాన్ని సోమవారం అందచేశారు. కార్యక్రమంలో కె.వెంకటరావు, లక్ష్మి, శ్రీరాములు, విశాలాక్షి పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ ర్యాంకర్‌కు అభినందనలు



బ్రాహ్మణిని అభినందిస్తున్న నాయకులు

గార: చదువుతోనే ఉన్నతమైన భవిష్యత్ ఏర్పడుతుందని, ఆర్థిక కష్టాలు ఉన్నా అధిగమించవచ్చని వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి కొయ్యాన నాగభూషణం, కొర్ని పంచాయతీ సర్పంచ్ పీస గోవిందరాజులు అన్నారు. చినతూలుగు గ్రామానికి చెందిన వంగ బ్రాహ్మణి ఎడ్‌సెట్ 2023లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన సందర్భంగా ఆమెను సోమవారం అభినందించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన బ్రాహ్మణి ప్రభుత్వ పాఠశాలలో చదివి మెరుగైన ర్యాంకు సాధించంపై హర్షం వ్యక్తం చేశారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉన్నత చదువులకు కావాల్సిన ఆర్థిక సాయం చేసేందుకు ముందుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



లావేరులో చౌడేశ్వరీదేవికి కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

లావేరు: మండలంలోని వస్త్రపురి కాలనీ, లావేరు గ్రామాల్లో చౌడేశ్వరీదేవి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికులు చౌడేశ్వరీదేవిని కులదైవంగా పూజిస్తారు. ఏటా ఆషాఢ మాసంలోని చివరి అమావాస్య రోజున చేనేత కార్మికులు చౌడేశ్వరీదేవి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం ఆషాఢమాస అమావాస్య కావడంతో లావేరు, వస్త్రపురికాలనీ గ్రామాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు, వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చౌడేశ్వరీదేవిని పురవీధుల్లో ఊరేగించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులపై దాడులకు పాల్పడేవారిపై ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు కోరారు. ఇటీవల కృష్ణా జిల్లా అవనిగడ్డలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి జిల్లా కోర్టు ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి, పి.రాము, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణ రావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సభ్యుడు కూన అన్నంనాయుడు, సీనియర్ న్యాయవాదులు, జె.గోవిందరావు, ఎం.జనార్దనరావు, ఎ.కృష్ణంరాజు, ఎ.భువనేశ్వరరావు, టి.వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమారుద్రునికి మహా రుద్రాభిషేకం



ఉమారుద్రునికి మహారుద్రాభిషేకాలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: సూర్యగ్రహణంతో సమానమైన సోమావతి అమావాస్య సందర్భంగా గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో మహారుద్రాభిషేకాలు సోమవారం జరిగాయి. ఆలయ అర్చకులు ఆరవల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో విశేష పూజలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను చేశారు. ఈ ప్రత్యేకమైన రోజును పురస్కరించుకొని అనేక ప్రాంతాలనుంచి పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు.

రూ.2 కోట్లతో.. విజయాదిత్య పార్కు సుందరీకరణ

- ప్రారంభమైన పనులు
- పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాట్లు



పార్కులో పనులు జరుగుతున్న దృశ్యం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరం బైరివానిపేట సమీపంలోని విజయాదిత్య పార్కును రెండు కోట్ల రూపాయలతో సుందరీకరించనున్నారు. గడచిన కొన్నేళ్లుగా ఈ పార్కు వృథాగా పడిఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. గతంలో ఒక హత్య కూడా జరిగింది. ఇటీవల జాతీయ రహదారిని అభివృద్ధి చేశారు. దీంతో పార్కు కూడా రోడ్డు సమీపానికి వచ్చినట్టైంది. దీంతో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పార్కు సుందరీకరణ చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీంతోపాటు పెద్దపాడు చెరువును కూడా పార్కుగా మలిచేందుకు అవసరమైన అంచనాలు ప్రభుత్వానికి పంపాలని, జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అధికారులు అంచనాలను నివేదించగా ప్రభుత్వం రూ.2 కోట్లను మంజూరు చేసింది. పనులను గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ సంస్థకు టెండరుపై అప్పగించారు. రెండు రోజుల క్రితం సంస్థ పనులను ప్రారంభించింది. సెప్టెంబరు 15వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పార్కు చుట్టూ ఫెన్సింగ్‌తోపాటు అందమైన మొక్కలను వేయడం, చెరువులో నీరు నిల్వ చేయడం, చెరువుపై నుంచి నడిచి వెళ్లే విధంగా చిన్న వంతెనను నిర్మించడం, పార్కు చుట్టూ నగరవాసులు, పర్యాటకులు సేద తీరేలా బెంచీలను ఏర్పాటు చేయడం వంటి పనులను చేపడతారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా క్యాంటిన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులను కూడా అమర్చాలని నిర్ణయించారు. ముందుగా చెరువు గట్టును పటిష్టం చేసి చుట్టూ కంచె వేసి అందమైన మొక్కలనునాటే పనులను చేస్తున్నారు. పనులన్నీ పూర్తయితే అత్యంత సుందరమైన పార్కుగా రూపుదిద్దుకొని నగర వాసులతోపాటు పర్యాటకులను, హైవే ప్రయాణికులను ఆకర్షిస్తుందనడంలో సందేహంలేదు.

త్వరితగతిన పనులు



పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పార్కును ఆహ్లాదకరంగా మలిచేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించాం. వాటి ఆధారంగానే పనులు జరుగుతున్నాయి.

– చల్లా ఓబులేసు, మున్సిపల్ కమిషనర్, శ్రీకాకుళం

వర్షంలోనే ఇంటింటికీ..



వర్షంలోనే కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- లావేరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: ఓ పక్క వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ లావేరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వానలోనే ఇంటింటినీ సందర్శించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి నవరత్నాలు పేరుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలన సీఎం జగన్‌కే సాధ్యమని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టరు కింతలి రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, లావేరు సర్పంచ్ ఉర్లాపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఇనపకుర్తి సతీష్, డోకల రాధ, సచివాలయం కన్వీనర్లు మహదాసు చక్రధరరావు, తార అప్పలరాజు, లంకలపల్లి భాస్కరరావు, ఎంఎంసీ డైరెక్టరు లంకలపల్లి నారాయణరావు, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, మండల ఏవో డి.మహేష్‌నాయుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఎల్.అప్పన్న, బి.శివబాబు, వైకేపీ ఏపీఎం బి.మాధవీలత, ఉపాధి ఏపీవో ఆర్.సత్యవతి, పార్టీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, గోపి, కొండక ప్రసాద్, చిన్నారావు, త్రినాథ్, పడాల పాపారావు, సగరపు విశ్వనాథం, బొంతు ఎల్లంనాయుడు, తూట అప్పలరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సాగునీటి కాలువ గట్లు నరికివేత!



సాగునీటి కాలువ గట్టు నుంచి మట్టిని తవ్వేసిన దృశ్యం



గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్, రైతులు

గార: సాగునీటి కాలువ గట్లు పటిష్టంగా ఉంటేనే శివారు ప్రాంతం వరకు సాగునీరు అందుతుంది. గట్లు పటిష్టత లేకపోతే గండ్లు పడడంతోపాటు సాగునీరు అందక.. పంటలను రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ విషయం రైతులకు తెలిసిన విషయమే. అయినా ఒకరిద్దరు రైతుల దురాలోచనతో పటిష్టమైన గట్లను నరికి ఆ మట్టిని తన పొలంలో కలిపేసి విస్తీర్ణం పెంచేసుకుంటున్నారు. దీనివలన పెద్దగా భూమి పెరగకపోయినా ఏదో ఆశతో గట్లు నరికేస్తున్నారు. ఇటువంటి సంఘటనే తూలుగు పొలాల మీదుగా కొర్ని వరకు వెళ్లే భైరిదేశిగెడ్డ (కొర్ని కాలువ) రైతులు గట్టు నుంచి మట్టిని జేసీబీ వాహనంతో తొలగించి తన పొలాన్ని పెంచుకుంటున్నారు. దీనివలన గండి పడే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొర్ని కాలువ శివారు ప్రాంతంలో సుమారు 600 ఎకరాలకు ఈ కాలువ ద్వారానే సాగునీరు అందుతుంది. అది గట్లు తొలగించే రైతులకు తెలియనదేమీ కాదు. దీనిపై సోమవారం ఉదయం కొర్ని సర్పంచ్ పీస గోవిందరాజులు ఆధ్వర్యంలో పలువురు రైతులు తహసీల్దార్ జెన్ని రామారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను తీసుకొని గట్లు నరికేసిన పొలాలను తహసీల్దార్ పరిశీలించారు. గట్టును నరికి వేసిన రైతులకు ముందుగా నోటీసులు జారీ చేశారు. గట్టును యధావిధిగా పటిష్టం చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణం పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

లావేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నామని ఐసీడీఎస్ పీవో సీహెచ్ ఝాన్సీరాం అన్నారు. రావివలస గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవన పనులను సోమవారం పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త డి.దేవి ఉన్నారు.

ధ్యానంతో మెరుగైన ఆరోగ్యం



ధ్యాన తరగతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు అన్నారు. స్థానిక పీఎన్ కాలనీలోని సాయి విద్యామందిర్‌లో హర్ ఘర్ ధ్యాన్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఒత్తిడి, భయం, ఆందోళన లేకుండా సానుకూలమైన పద్ధతులను వివరించారు. ప్రాణాయామం, ధ్యానం వలన జ్ఞాపకశక్తి పెరుగుతోందన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, డీడీసీ సభ్యులు బి.వి.రవిశంకర్, బి.పాండురంగారావు, పి.ఎస్.మహాలక్ష్మి, కె.అప్పారావు, ఎస్.తవిటిరాజు, టి.అనంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం



పంటకు సేంద్రియ ఎరువును పిచికారీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతం అవుతుందని కేశవరావుపేట ప్రకృతి వ్యవసాయం సమన్వయకర్త వై.చంద్రకళ అన్నారు. ఎస్.ఎం.పురం, కేశవరావుపేట, లక్ష్ముడుపేట, ఫరీదుపేట గ్రామాల్లో రైతులకు పలు పంటలపై సోమవారం అవగాహన కల్పించారు. పంటలను మార్చుచేసి సాగు చేయాలన్నారు. కూరగాయల పంటల్లో సేంద్రియ ఎరువులను పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. సిబ్బంది రాంబాబు, గున్నంనాయుడు, పద్మావతి, రాజేశ్వరి, వేంకటేశ్వరి పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లా..

వలంటీర్లు కుటుంబ సభ్యుల్లా ఉంటూ సేవలందిస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారి కృషితోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెబుతున్నారు. అలాంటి వారిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదంటున్నారు.

–లావేరు, ఎచ్చెర్ల క్యాంపస్

ఆస్పత్రికి వచ్చి..పింఛన్ అందజేసి



అనారోగ్య సమస్యలతో రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చేరాను. వైద్య, ఇతర ఖర్చుల కోసం ఇబ్బందులు పడే సమయంలో మా గ్రామానికి చెందిన వలంటీరు తీటి రాజు ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బంది తప్పింది. వలంటీర్‌కు రుణపడి ఉంటా.

–గంధవరపు పైడయ్య, గుమడాం, లావేరు మండలం

సేవలు వెలకట్టలేనివి



నేను మూగ, చెవుడుతో ఇబ్బంది పడుతుంటాను. ఇంటర్మీడియెట్ పూర్తి చేశాను. మా వలంటీర్ పుట్టా రవి ప్రతినెల ఒకటో తేదీ ఉదయాన్నే మూడు వేల రూపాయల పింఛన్ ఇంటికి తెచ్చి అందజేస్తున్నాడు. అమ్మఒడి సైతం వర్తించింది. వలంటీర్ కృషితో అన్ని పథకాలను వర్తిస్తున్నాయి. వారి సేవలు వెలకట్టలేనివి.

–చిలక తేజేశ్వరి, చిలకపాలేం,ఎచ్చెర్ల మండలం

క్షణాల్లో ధ్రువీకరణ పత్రాలు మంజూరు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హులైన లబ్ధిదారులకు జగనన్న సురక్ష పథకం ద్వారా సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు క్షణాల్లో అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంచాం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా 11 సేవలు సత్వరమే అందుతున్నాయన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాన్నారు. తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, పిల్ల ఆనందరావుపాత్రుడు, సంచాం సర్పంచ్ రెడ్డి రాము, గ్రామ నాయకులు రెడ్డి ఆనంద్, దాలినాయుడు, రెడ్డి రామకృష్ణ, మీసాల రాము పాల్గొన్నారు.

తోటపల్లి కాలువలో మట్టి తొలగింపు



కాలువలో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

రణస్థలం: రణస్థలం బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు రావాల్సి ఉండగా.. తోటపల్లి కాలువకు అడ్డంగా దేవరాపల్లి సమీపంలో మట్టి పేరుకుపోయింది. దీంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సొంత నిధులతో జేసీబీ ఏర్పాటు చేసి కాలువలో పూడుకుపోయిన మట్టిని సోమవారం తొలగించినట్టు తోటపల్లి కాలువ జేఈ రామలక్ష్మి తెలిపారు. రణస్థలం బ్రాంచ్ కెనాల్‌కు నీరు సకాలంలో చేరాల్సి ఉండగా.. ఇటీవల కురిసిన వానలకు కాలువ గట్టు మట్టి అందులో పడిపోయింది. విషయం ఎమ్మెల్యేకు తెలియజేయగానే వెంటనే స్పందించి జేసీబీని ఏర్పాటు చేయడంతో కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించామన్నారు. పూడిక తొలగించిన వెంటనే దేవరాపల్లి చెరువును నీటితో నింపుతామన్నారు. సత్వరమే స్పందించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సత్యసాయి వనం ఏర్పాటు



స్థల పరిశీలన చేస్తున్న సమితి ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం గ్రామంలోని స్కై వ్యవసాయ కళాశాలలో 'సాయి బృందావనం'ఏర్పాటు చేయనున్నట్లు సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు వెల్లడించారు. కళాశాలను సోమవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా సాయి బృందావనాలు ఏర్పాటులో భాగంగా కోటి మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. పలు రకాల మొక్కలతో హరిత వనంలా సాయి బృందావనాన్ని తీర్చిదిద్దనున్నట్టు వివరించారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తితో కలిసి స్థల పరిశీలన చేశారు. ప్రతినిధులు రామచంద్రరావు, అమ్మాయమ్మ, మూర్తి పాల్గొన్నారు.

సాగునీటిపై ప్రత్యేక దృష్టి



రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని పొన్నాడ ప్రాంతానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు ఎంపీపీ మొదలవలస చిరంజీవిని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కలిసి మాట్లాడారు. పొన్నాడ శివారులో ఉన్నందున ఖరీఫ్ సీజన్‌లో పంటలకు సాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీపీ స్పందిస్తూ జెడ్పీ నిధులు రూ. 10 లక్షలతో అత్యవసర మరమ్మతులు నిర్వహించినట్లు చెప్పారు. వర్షాలు అనుకూలిస్తున్నాయని, మూడు రోజుల్లో శివారు ప్రాంతాలకు సాగు నీరు చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, నేతింటి నీలం ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



సభ్యులతో మాట్లాడుతున్న రేగిడి లక్ష్మి

జి.సిగడాం: కంచికామాక్షి అమ్మవారి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి అన్నారు. ఆలయ ప్రాంగణంలో కంచికామాక్షి అమ్మవారి అలయ కమిటీ చైర్మన్ సింహాద్రి ధనుంజయాచారి సమక్షంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. సంఘం అధ్యక్షుడు కొండపల్లి సూర్యనారాయణ సమాధానం ఇస్తూ ఎప్పుడూ కాంచికామాక్షి అమ్మవారి అలయం, విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం పాటు పడుతున్నామన్నారు. సంఘ సభ్యులు ముందూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాగ్రత్తగా అమ్మవారి వారాలు

- సీఐ సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని దమ్మల వీధిలో త్వరలో నిర్వహించే అమ్మవారి వారాలను నిబంధల మేరకు.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా జరుపుకోవాలని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు ఆ వీధిలో సుమారు 40 మంది యువకులు, పెద్దలతో కలిసి సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు అనుమానం ఉంటే తమకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

సక్రమంగా విధి నిర్వహణ

జి.సిగడాం: సచివాలయాల్లో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది అంకితభావంతో వ్యవహరించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు జాడ, జగన్నాధవలస గ్రామాల్లో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పాల్గొంటారన్నారు. ఎంపీడీవో నిశ్చల, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కూనిబిల్లి కోటి, పొట్నూరు సురేష్‌కుమార్ ఉన్నారు.